


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -177-

**(5 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ప్రేమ వివాహాల** విషయంలో గోత్రాల సంగతి ఆలోచించవలసిన అవసరం కూడా పోతోంది. హృదయాలు ఉప్పొంగి, మధ్యన వున్న భూభాగాన్ని ముంచెత్తి కలసిపోయే రెండు మహా సముద్రాలు ఒక క్రొత్త ప్రమాణాన్ని కల్పిస్తున్నప్పుడు గోత్రాల సంగతేమిటీ?

మన ఆచారం ప్రకారం గోత్రాలు కలిస్తే సూత్రం కట్టడానికి ఎంతమాత్రం వీలుండదు. సంబంధాలు రాగానే ముందే అంటూ వుంటారు ఇంట్లో వున్న ముసలివాళ్ళు అసలు గోత్రం సంగతి తెలుసుకోండి ముందు లేకపోతే వృధా శ్రమ అవుతుంది అని.

గోత్రం అడ్డం వచ్చిందిగాని, లేకపోతే ఆ మాత్రం సంబంధం కుదరడం చాలా కష్టం. పిల్ల ఐశ్వర్యానికి ఆ గోత్రం "పెద్దమ్మ" అడ్డు వచ్చినట్లు వచ్చింది అని కొందరు గోల చేస్తూ వుంటారు.

ఇటీవల ఒక అబ్బాయికి సంబంధం వచ్చింది. గోత్రం కూడా చెప్పాం. కాని పిల్లతండ్రి "మీరు వచ్చి పిల్లను చూడండి" అన్నాడు. అంతా సిద్ధపడ్డారు ప్రయాణానికి. ఇలా వస్తున్నామని ఫోను చేసి అసలు మీ గోత్రమేమిటి? మా గోత్రం వ్రాశాం కదా అది చూచే మీరు మమ్మల్ని ఆహ్వానించి వుంటారు?" అన్నాం.

పిల్ల తండ్రి "అవును చూశాను. మీరేం ఆలోచించనక్కరలేదు. బయలుదేరి రండి" అన్నాడాయన.

"వస్తున్నాం సరే, గోత్రమేమిటి?" అని మళ్ళీ ప్రశ్నించాం.

"గోత్రం ఒకటే అయినా నాకేం అభ్యంతరంలేదు. గోత్రాల గొడవేమిటి కులాలే అంతరించాలని చూసే రోజుల్లో" అన్నాడు.

కాని పిల్లాడి తాలూకు వాళ్ళు తోక త్రిక్కిన త్రాచుల్లాగా లేచారు. "గోత్రం వద్దంటాడా? ఆచారాల్ని దుమ్ములో కలుపుతానంటాడా? మేం వట్టి మూర్ఖులమనుకున్నాడా? ప్రపంచంలో ఇక పిల్లలు లేరనుకున్నాడా?" ఇలా స్వస్తి వాచకాలు ప్రారంభించారు.

"మీ యిష్ట ప్రకారం చెయ్యండి. ఆయన ఉద్దేశ్యం చెప్పాడు. కాలమిపుడు ప్రగతి పథంలో వుంది. పైగా ఆ అమ్మాయి డాక్టరు పాసయింది. అందంగా వుంటుంది" అన్నాను.

"డాక్టరు ప్యాసవనీ, ఉప ప్రధాని పదవి చేయనీ గోత్రం ఒకటైతే ఎలాగండీ ఆ మాత్రం మర్యాద ఉండక్కర్లా?" అని గందరగోళం చేశారు.

ఈ విషయమంతా పెళ్ళి కుమారుడు విన్నాడు. అతగాడు పెద్ద హోదాలో వున్నాడు. తల్లి తండ్రుల్ని నిమిత్తమాత్రులుగా అడ్డం పెట్టుకున్నాడు మర్యాద కోసం. గోత్రం మూలంగా ఒక గొప్ప సంబంధం పోవడం యిష్టంలేక పోయింది.

"నాన్నగారూ కొంచెం పనివుంది. వరంగల్ వెళ్ళివస్తాను. ఒక మిత్రుణ్ణి కలుసుకోవాలి" అని చెప్పి బయలుదేరి సరాసరి పెళ్ళి కుమార్తెను చూడటానికి వెళ్ళాడు.

పిల్ల నచ్చింది. వాళ్ళకు పిల్లవాడు నచ్చాడు. చేసుకుంటానని చెప్పాడు. అయితే ఒక షరతు పెట్టాడు.

"మా అమ్మా నాన్నా పెళ్ళికి రాకపోవచ్చు. అందుకు మీరు యిష్టపడి పెళ్ళి చెయ్యాలి" అన్నాడు.

వాళ్ళు కుర్రవాణ్ణి చూసి సంతృప్తి పడటం వల్ల సరే అన్నారు.

ఇంటికి తిరిగి వచ్చి జరిగిన సంగతంతా చెప్పాడు. తల్లితండ్రులకు ఎంతో కోపం వచ్చింది.

"గోత్రాలు కలిసినాయి కదట్రా! ఎలా వప్పుకొన్నావు?" అన్నాడు తండ్రి.

"నేను వెళ్ళేటప్పుడు గోత్రం తీసి రైలు పెట్టి కిటికీలోనుంచి ప్రక్కన వున్న పర్రలోకి విసిరివేశాను. ఇంకేం కలుస్తుంది నాన్నా" అన్నాడు.

తల్లి తండ్రులు పెళ్ళికి రామని పట్టుబట్టారు. మీ యిష్టమన్నాడు కుమారుడు.

అసలు "సింపుల్ మారేజ్ అంటే నాకిష్టం" అన్నాడు కుమార రత్నం.

చాలాకాలం తల్లిదండ్రులు పంతం వదలలేదు. ఒక మనుమడు పుట్టిన తర్వాత వెళ్ళి వాణ్ణి ఎత్తుకుని "మా వంశోద్ధారకుడు" అని ఘనంగా చెప్పుకుంటున్నారు.

మనువులు సరిగ్గా కుదరక ఆడపిల్లల తండ్రుల ముఖాలు మానుగాయరంగు పట్టిపోతున్న ఈ కాలంలో గోత్రాలు కలిసినాయని కొందరు, ఋషులు కలిశారని కొందరూ సంబంధాలు వదులుకుంటున్నారు ఆచారాల మీద అపేక్ష కొద్దీ.

ఇలాటి పరిస్థితులలో యువతరం వారు తెగించడం వల్ల కొంత సులువు ఏర్పడుతోంది. ఆచారల మాటేమిటి అంటారు? ఆ ప్రవాహానికి అంతులేనన్ని గళ్ళుపడ్డాయి. ఎన్నని పూడ్చగలరు. ఈ నాగరికతా ప్రపంచాన్ని  తిరిగి మళ్ళీ ఎక్కడ వెనక్కి లాక్కుపోయి ఆ పరిధుల్లో ఇమడ్చగలరు?

ఆచారాలన్నీ మారిపోతున్నాయి. ఒక ప్రక్క తేలిపోతున్నాయి. "నదీ నాంసాగరోగతిః" అన్నట్లు నూతన సాంప్రదాయాలనే మహా సాగరంలోకి దుముకుతున్నాయి పాత ఆచారాలన్నీ.

ఒక గృహస్థు కుమారుడికి సంబంధం చూస్తూ ఒక పిల్ల విషయంలో అంతా నచ్చడం జరిగిన తర్వాత ఒక్క ఋషి కలిశాడని తెలిసింది. ఆ కారణంగా ఆ సంబంధం వదులుకోవలసి వచ్చింది. పిల్ల బాగుంది. కట్న కానుకలు బాగానే ముట్టేలాగా వున్నాయి. అందువల్ల పిల్లవాడిక్కూడా ఆ సంబంధం మీద మోజు ఏర్పడింది.

కాని తండ్రి చెప్పాడుట "నాయనా ఎన్ని విధాలుగా సంబంధం నచ్చితే మాత్రం ఏం లాభం నాయనా ఋషి ఒక్కడు కలిశాడురా ఏం చేస్తాం?" అన్నాడుట అతి విచారం ప్రకటిస్తూ.

ఆ మాట విని కుమారుడు "అదేమిటి నాన్నా ఒక్క ఋషికోసం భేషైన సంబంధం మానుకుంటామా? కావాలంటే ఆ ఋషిని వదులుకుంటాంగాని. అంత హుషారుగల అమ్మాయిని వదులుకుంటామా?

అయినా ఇప్పటి ఋషులా వాళ్ళు? ఎన్నో వేల సంవత్సరాల క్రింద ఏర్పాటు చేశారు. మనమేం నోటిచ్చి తెచ్చుకున్నామా? ఒట్టేసి వప్పుకున్నామా? అయినా ఏడుగురు ఋషులున్నారుగా. ఒక్కణ్ణి తీసేద్దాం నాన్నా. ఆరుగురనే చెప్పుకుందాం. ఏడుగురిలో నీ యిష్టమొచ్చిన ఋషిని డిస్మస్ చేసి పారెయ్యి. మనం వెళ్ళి హాయిగా పెళ్ళి చేసుకు చక్కావద్దాం" అన్నాడుట.

ఇలా పెళ్ళిళ్ళ కార్యక్రమాల్ని తేలిక పరుస్తున్న యువకుల్ని అభినందించాలా? నిందించాలా? అనుభవాన్ని బట్టిగాని నిర్ణయించుకోలేరంటారా?

"ఏమండీ మీ అబ్బాయికి ఎం.బి.బి.యస్. మొదటి సంవత్సరంలోనే సంబంధాలు వెతుకుతున్నారట. డిగ్రీ వచ్చిన తర్వాత అయితే దిబ్బెన నిండేదిగా?" అని ఒక గృహస్థుని ప్రశ్నించాడట మిత్రుడు.

దానికా గృహస్థు ఇలా చెప్పాడుట "మీరు చెప్పిన మాట నిజమే. కాని ఆ రోజులు పోయాయి. డాక్టరు కోర్సు హాయిగా గడిపి తర్వాత వచ్చి 'నాన్నగారూ మీ ఆజ్ఞ శిరసావహిస్తాను' అని చేతులు కట్టుకుని నిలబడే రోజులా ఇవి?

పి.యు.సి లోనే ప్రేమించడాలు ప్రారంభమవుతున్నాయి. ఇక యం.బి.బి.యస్ లోకి చేరిన తర్వాత ఉరుకుంటారా? ఏ పిల్ల వచ్చి ఎగరకొట్టుకుపోతుందో ఎలా తెలుస్తుంది. ఇప్పుడే చేస్తే పోనీ నాలుగువేలు తక్కువ వస్తాయి అదన్నా దక్కుతుంది.

లేకపోతే డాక్టరు కోర్సు డబ్బు మనదీ తమాషాగా తన్నుకు పోయేదింకొకరు అవుతారు. ఈ ప్రేమలకు భయపడి పెందరాడే చేసేస్తున్నానండీ అంతేగాని, పెద్ద కట్నం మీద ఆశ లేకకాదు" అన్నాడుట ఆయనగారు.

మన సంఘం ఎన్నాళ్ళు తన్నుకున్నా, ఎంత ప్రచారం చేసినా, ఎన్ని నాటకాలు వ్యాసాలు వ్రాసినా, చట్టాలు చేసినా వర కట్నాల విషయంలో కుదరని పరిష్కారం ప్రేమ వివాహాలవల్ల కొంతవరకైనా సిద్ధించడం చెప్పుకో తగ్గ విషయంకాదూ!

Post your comments